సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
05-01-2026
పేజీలు: 02

పెద్ద సభలో కూర్చొనే అవకాశం ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీకి, నిజామాబాద్‌లో తనకు ఓటు వేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు థాంక్స్ చెబుతున్నట్టుగా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి తనకు అనేక కట్టుబాట్లు ఎదురవుతున్నాయని... ఈ క్రమంలోనే ఆ పార్టీ నుంచి సంక్రమించిన ఎమ్మెల్సీ పదవిని నిర్వహించడం నైతికత కాదని, అందుకే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతున్నానని తెలిపారు.

# పుట్టింటి బంధాలన్నీ తెంచుకున్నా: కవిత



## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ.. సెక్యులర్లు, మావోయిస్టు సానుభూతిపరులకు ఆహ్వానం..

తన పుట్టింటి నుంచి అన్నిరకాల బంధాలు, బంధనాలు తెంచుకొని బయటకు వచ్చానని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తల్లిగారి ఇంటి నుంచి అవమానభారంతో ఆత్మగౌరవం కోసం బయటకు రావాల్సి వచ్చిందని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలకు పౌరుషం ఎక్కువని ఎవరినీ ఏదీ అడగరనీ, అవమానిస్తే మాత్రం చూస్తూ ఊరుకునే రకం కాదనీ స్పష్టం చేశారు. ప్రజలు, దేవుడి దయతో గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని అన్నారు.

తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్సీ, 'తెలంగాణ జాగృతి' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కన్నీరు పెట్టుకున్నారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగమంటూ.. కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కవిత బీఆర్ఎస్ పార్టీపై అనేక ఆరోపణలు చేశారు. పార్టీలో ఏ బాధ్యత ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేశానని.. కానీ పార్టీలో ప్రశ్నిస్తే తనపై కక్షగట్టారని కవిత అన్నారు. అక్కడే అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోతే రాష్ట్రంలో ఎలా ఉంటుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తనను ఘోరంగా అవమానించిందని ఆరోపించారు. ఈడీ, సీబీఐలతో పోరాడేటప్పుడు తనకు అండగా నిలవలేదన్నారు. కేసీఆర్‌పై అక్కసుతోనే బీజేపీ తనను జైలులో పెట్టించిందని ఆరోపణలు గుప్పించారు. అనంతరం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడిన కవిత.. రాష్ట్రంలో కొత్త పార్టీ అవసరం ఉందని.. తెలంగాణ జాగృతి రాజకీయ శక్తిగా అవతరిస్తుందని వెల్లడించారు.

**ఘోరంగా అవమానించారు..**

"అవమాన భారంతో ఇంటి పార్టీ నుంచి అన్ని బంధాలు తెంచుకుని బయటకు వచ్చాను. ఇది కేవలం నా ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటం. అవమానకరంగా నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు. ఇక నుంచి రాష్ట్ర ప్రజల కోసం పని చేస్తా. దేవుడు, ప్రజల దయతో తెలంగాణలో గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతాం. దాని కోసం ఆడబిడ్డల సహకారం నాకు కావాలి. బీఆర్ఎస్‌కు అధికారం వచ్చాక.. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు, ఉద్యమకారులకు ఎలాంటి గౌరవం దక్కలేదు. రాజకీయంగా ఎదగకుండా చేసింది పార్టీ. బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత మంచి పని చేసినా.. శాశ్వతంగా చేయలేదు. ఇక పార్టీలో కూడా అందరికీ గుర్తింపు, గౌరవం దక్కలేదు" అని కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ పార్టీ కూడా మహిళలను, యువతను ఘోరంగా మోసం చేస్తోంది. ఈ రెండు పార్టీలు కూడా ప్రజలను మోసం చేశాయి. అందుకే తెలంగాణను మనుసులో నింపుకున్న ప్రజల కోసం.. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే రాజకీయ పార్టీ అవసరం ఉంది. తప్పకుండా తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఎదుగుతుంది. ఈ పార్టీ తెలంగాణ ప్రజల పక్షాన పనిచేస్తుంది. పార్టీ ఏంది (సిద్ధాంతాలు, విధివిధానాలు) అనేది సాంకేతిక అంశాలు. కానీ 2029లో ఎన్నికల్లో మాత్రం తెలంగాణ ప్రజల తరఫున పోటీ చేస్తాం. ఒక శక్తిగా తెలంగాణ జాగృతి చట్టసభల్లో అడుగుపెడుతుంది"

**మవోయిస్టు సానుభూతిపరులకు ఆహ్వావానం..**

"లెఫ్ట్ పార్టీ సోదరులకు, మావోయిస్టు సానుభూతి పరులకు, మావోయిస్టులకు ఆహ్వానం పలుకుతున్నా. ఎవరైతే మనుగడ సాగించలేకపోతున్నారో, రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తులు రావాలని అనుకుంటున్నారో, ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేసే పార్టీలు రావాలనుకుంటున్నారో.. వారికి పిలుపునిస్తున్నా. రండి.. ఒక ఆడబిడ్డగా ముందడుగు వేస్తున్నా మద్దతు ఇవ్వండి. అంతేకాకుండా విద్యార్థులు, యువత జాగృతిలో చేరి పిడికిలి బిగించి పోరాటం చేయండి. ఇక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. మహిళల హక్కుల కోసం ముందడుకు వేస్తున్నా.. ఆడబిడ్డలందరూ నన్ను దీవించండి. మైనార్టీలు కూడా మద్దతు ఇవ్వాలని కోరుకుంటున్నా. తెలంగాణ సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వండి" అని కవిత విజ్ఞప్తి చేశారు.

**మండలిలో కల్వకుంట్ల కవిత కంటతడి**

మండలిలో కవిత మాట్లాడుతూ భావోద్వేగానిగి గురయ్యారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామన్నారు కవిత. అప్పటి నుంచి ఇక తనపై ఆంక్షలు మొదలైనట్టుగా తెలిపారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు మాట్లాడుతున్నట్టుగా చెప్పారు. బీఆర్ఎస్‌లో తనకు ఏ బాధ్యత ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేసినట్టుగా కవిత గుర్తుచేసుకున్నారు. పార్టీలో ప్రశ్నిస్తే.. తనపై కక్షగట్టారన్నారు. అక్కడ అంతర్గత ప్రజాస్వామ్యం లేకుంటే.. ఇక రాష్ట్రంలో ఎలా ఉంటుదని ప్రశ్నించారు. పార్టీలో తననకు ఘోరంగా అవమానించిందన్నారు. ఈడీ, సీబీఐలతో పోరాడే సమయంలో తనకు అండగా నిలవలేదన్నారు. కేసీఆర్‌పై కక్షతో బీజేపీ తనను జైలులో పెట్టిందని వ్యాఖ్యానించారు.



ఫోన్ ట్యాపింగ్ కేసులో

# హరీశ్‌రావుకు ఊరట

## కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కెదురు

### హరీష్ రావుకు క్లీన్ చిట్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ చక్రధర్ గౌడ్ సుప్రీంకోర్టుకు వెళ్లగా జస్టిస్ బేలా ఎం.త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. కాగా, చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కొనసాగుతోందని, దీనికి సంబంధించి కీలక ఆధారాలు ఉన్నందున హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ప్రభుత్వం సమర్పించిన వాదనలతో విభేదించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హరీష్ రావుకు ఎటువంటి సంబంధం లేదని గతంలోనే హైకోర్టు స్పష్టం చేసిన విషయాన్ని అత్యున్నత న్యాయస్థానం ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో, ఇకపై ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుపై ఉన్న ఆరోపణలన్నీ దాదాపు ముగిసినట్లేనని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఈ కేసు విచారణలో ఆయనను ప్రతివాదిగా చేర్చే అవకాశం లేదనే విషయం కోర్టు తీర్పు ద్వారా తేట తెల్లమైంది.

# మత్తు రహిత రాష్ట్రం లక్ష్యం

ఇచ్ఛాపురంలో విజయవంతంగా అభ్యుదయం సైకిల్ యాత్ర ఆంధ్రప్రదేశ్ (AP) ను మత్తురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢసంకల్పంతో ఉన్నారని గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ కేంద్రంగా మారి యవత భవిష్యత్తు చిన్నా భిన్నమైందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరావు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో'' జంటూ 25 మంది పోలీసులు నాలుగు జిల్లాలు, 75 మండలాలు, 508 గ్రామాల్లో 51 రోజులపాటు 1,300 కి.మీ దూరం సాగిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్ను హోంమంత్రి వంగల పూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరిం వారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడతూ కూటమి ప్రభుత్వం కలిగిన శక్తిగా మార్చేందకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో వాణించాలని ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడకలు జరగడం సంతోషంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితల కష్టాలు చూసి ఆనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఐజీ గోపినాథ్ జెట్టి మానసపుత్రికగా వచ్చిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకు వచ్చాం. కేవలం శిక్షల ద్వారానే అవగాహన ఆమె కాకండా, ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ. ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్ ఫ్రీ నెంబర్కు సమాచారం అందించాలని కోరారు. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి



మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్ శాఖతోనే సాధ్యం కాదని ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపార, ఈగల్ ఐజి ఎ. రవికృష్ణ మాట్లాడుతూ స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థమవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలో విద్యార్థలు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్ర మార్పు వస్తే మత్తు పదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్కు తెలపాలని, టోల్ ఫ్రీ నెంబర్ను వినియోగించాలని, మీక పోలీసుల నుంచి ఎటువంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టి ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వుండ్కర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలు, వేల మంది విద్యార్థులు, పోలీసులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. మొదట ఇచ్ఛాపురంలో పోలీస్ స్టేషన్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు 'డ్రగ్స్ వద్దు బ్రో పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో రాజావారి మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రితో పాటు ప్రముఖులు సైకిల్ తొక్కగా, హోంమంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు ఎన్. ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష ఉన్నారు.

# అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా భారత్

భారతదేశం వ్యవసాయంలో మరో చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. భారత్ తొలిసారిగా చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారుగా అవతరించిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. భారత్ 150.18 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేయగా, చైనా 145.28 మిలియన్ టన్నులను ఉత్పత్తి చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి 25 విభిన్న పంటలకు చెందిన 184 కొత్త, మెరుగైన విత్తన రకాలను విడుదల చేశారు. ఈ విత్తనాలు అధిక దిగుబడిని, మెరుగైన నాణ్యత గల పంటలను అందించి, రైతులు ఎక్కువ డబ్బు సంపాదించడానికి సహాయపడతాయని పేర్కొన్నారు. భారత్ ఒకప్పుడు ఆహార కొరత ఉన్న దేశంగా



పేరుగాంచిందని, కానీ నేడు అది స్వయం సమృద్ధిగా ఉండటమే కాకుండా ప్రపంచానికి ఆహార ధాన్యాలను కూడా అందిస్తుందని ఆయన అన్నారు. దీంతో భారత్ ప్రపంచానికి అన్నపూర్ణగా మారింది. భారతదేశం ఇప్పుడు పెద్ద మొత్తంలో బియ్యాన్ని ఎగుమతి చేస్తోందని, తగినంత ఆహార ధాన్యాల నిల్వలను కలిగి ఉందని, పూర్తి ఆహార భద్రతను నిర్ధారిస్తుందని మంత్రి అన్నారు.

# పోలీసుల ఎదుటే వ్యక్తి దారుణ హత్య




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాలో సోమవారం భయానక ఘటన చోటుచేసుకుంది. తనకల్లు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఓ వ్యక్తిని దుండగులు అత్యంత క్రూరంగా హత్య చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కళ్ల ముందే ఈశ్వర ప్రసాద్ అనే వ్యక్తిపై కత్తులతో దాడి జరగడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఇలాంటి ఘటన జరగడం భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రాథమిక విచారణలో ఈ హత్యకు వివాహేతర సంబంధంపై ఉన్న అనుమానాలే కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వ్యక్తిగత విభేదాలే ఈ దాడికి దారి తీసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసులో హరి, చెన్నప్ప అనే ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యకు గల పూర్తి కారణాలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# కుర్రకారుకు చెమటపట్టిస్తోందిగా

ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచుతూ అందరినీ ఆకట్టుకుంటుంది. కెరీర్ మొదట్లో చాలా పద్ధతిగా కనిపించిన ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచి, హాట్ హాట్ లుక్స్‌తో కుర్రకారును మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ గ్రీన్ కలర్ ట్రెండీ డ్రెస్‌లో అదిరిపోయే లుక్‌లో ఫొటోలకు ఫోజులిచ్చింది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి.అందాల చిన్నది కృతి శెట్టి గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఈ బ్యూటీ ఉప్పెన సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమై, మొదటి సినిమాతో అందరినీ మాయ చేసింది. ముఖ్యంగా తన గ్లామర్‌తో కట్టిపడేసి, యూత్ ఫేవరెట్ అయిపోయింది.ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తూనే బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకోవడంతో, స్టార్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో ఈ బ్యూటీ సత్తా చాటుతుంది అని అందరూ అనుకున్నారు. కానీ ఈ అమ్మడుకు మాత్రం మొదటి సినిమా తర్వాత లక్కు కలిసిరాలేదనే చెప్పాలి. ఎందుకంటే? ఉప్పెన తర్వాత ఈ అమ్మడుకు అనేక సినిమాల్లో ఛాన్స్‌లు వచ్చాయి. వరసగా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ప్రతి సినిమా చేసింది.



# 'సీజ్ చేసిన నా ఆటో ఇవ్వకపోతే.. పామును వదులుతా'..

ట్రాఫిక్ పోలీసులను బెదిరించిన డ్రైవర్

హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఎప్పుడు ఎలా జరుగుతాయో కానీ.. పోలీసులకు మాత్రం రకరకాల విచిత్ర అనుభవాలు ఎదురవుతున్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ దొరికిపోయిన వారు పోలీసుల నుండి తప్పించుకోవడానికి రకరకాల విన్యాసాలు చేస్తుంటారు. కొందరు తమ పలుకుబడిని ఉపయోగిస్తే.. మరికొందరు రోడ్డుపై పడుకుని ఏడుస్తూ నానా హంగామా చేస్తుంటారు. అయితే.. తాజాగా పాతబస్తీలో జరిగిన ఒక సంఘటన మాత్రం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. తన ఆటోను సీజ్ చేసినందుకు ఏకంగా పాముతో పోలీసులను బెదిరించిన ఒక డ్రైవర్ ఉదంతం ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్ గా మారింది. పాతబస్తీ పరిధిలోని చాంద్రాయణగుట్ట చౌరస్తా వద్ద శనివారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఆటో నడుపుతున్న ఒక డ్రైవర్‌ను పోలీసులు ఆపి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. అందులో రీడింగ్ ఏకంగా



150 పాయింట్లు రావడంతో పోలీసులు షాక్ అయ్యారు. నిబంధనల ప్రకారం ఆటోను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. తన వాహనాన్ని పోలీసులు తీసుకెళ్లిపోతున్నారన్న కోపంతో ఆ డ్రైవర్ ఊహించని పని చేశాడు. ఆటోలో తన సామగ్రి ఉందని.. అది తీసుకుంటానని చెప్పి వాహనం దగ్గరకు వెళ్లిన ఆ డ్రైవర్.. అకస్మాత్తుగా లోపలి నుండి ఒక పామును బయటకు తీశాడు. ఆ పామును చేతికి చుట్టుకుని.. తన ఆటోను వదిలేయకపోతే పామును వారిపైకి వదులుతానంటూ పోలీసులను బెదిరించడం మొదలుపెట్టాడు. ఊహించని ఈ పరిణామంతో పోలీసులు ఒక్కసారిగా కంగారుపడి పక్కకు తప్పుకున్నారు. ఆ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని ఆ డ్రైవర్ పాముతో సహా అక్కడి నుండి పరారయ్యాడు. హైదరాబాద్ పోలీసులు ఇలాంటి వింత పరిస్థితులు ఎదుర్కోవడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో తనిఖీలు చేస్తున్న సమయంలో కొందరు తాగుబోతులు ఏకంగా బ్రీత్ అనలైజర్ మిషన్లను పట్టుకుని పారిపోయిన సందర్భాలు ఉన్నాయి. మరికొందరు తమ బంధువులు పెద్ద పదవుల్లో ఉన్నారని బెదిరింపులకు దిగడం సర్వసాధారణం అయిపోయింది. ఇంటికి వెళ్తే భార్య కొడుతుందని, తల్లిదండ్రులు తిడతారని పోలీసుల కాళ్లపై పడి బోరున ఏడ్చే విద్యావంతులను కూడా మనం చూస్తూనే ఉంటాం. మద్యం మత్తులో వాహనాలు నడపడమే కాకుండా, విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను భయపెట్టడం లేదా బెదిరించడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చాంద్రాయణగుట్ట ఘటనలో పరారైన ఆటో డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తామని.. ఇలాంటి విపరీత చేష్టలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

## సంక్రాంతి ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

# టోల్‌గేట్ల వద్ద ఆగక్కర్లేదు

సంక్రాంతి పండుగ వేళ భాగ్యనగరం నుంచి సొంత ఊర్లకు వెళ్లే లక్షలాది మంది ప్రయాణికులకు ఈసారి టోల్ ప్లాజాల వద్ద నిరీక్షణ తప్పనుంది. ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ వినూత్నంగా 'బూస్టర్ లేన్ల'ను ప్రవేశపెడుతోంది. సాధారణంగా పండుగ సమయాల్లో శంషాబాద్, బొంగులూరు, పెద్ద అంబర్‌పేట్ టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతుంటాయి. ఈ సమస్యను అధిగమించడానికి, ఈ మూడు ప్రధాన టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేకంగా బూస్టర్ బారియర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఫాస్టాగ్ ఉన్న వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండానే నేరుగా వెళ్లిపోవచ్చు. ప్రతి టోల్ ప్లాజాలో ఇందుకోసం రెండు ప్రత్యేక లేన్లను కేటాయించారు. పండుగ రోజుల్లో ఓఆర్ఆర్ పై వాహనాల తాకిడి ఊహించని విధంగా ఉంటుంది. శంషాబాద్ మార్గంలో సాధారణ రోజుల్లో 35 వేల వాహనాలు తిరుగుతుంటాయి. పండుగ సమయంలో కేవలం మూడు గంటల వ్యవధిలోనే లక్షన్నర వాహనాలు వస్తుంటాయి. పెద్ద అంబర్‌పేట్ వద్ద సాధారణంగా 20 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తే.. పండుగ వేళ ఆ సంఖ్య 90 వేలకు చేరుతుంది. బొంగులూరు సమీపంలో వాహనాల సంఖ్య సాధారణ రోజుల కంటే మూడు రెట్లు పెరుగుతుంది.





ఈ భారీ రద్దీని తట్టుకునేందుకు ప్రస్తుతమున్న 12 నుంచి 15 టోల్ బూత్‌లు సరిపోవడం లేదని గుర్తించిన అధికారులు, ఈ బూస్టర్ లేన్లను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మరోవైపు.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి శుభవార్త అందే అవకాశం ఉంది. జనవరి 9 నుంచి 14 వరకు, జనవరి 16 నుంచి 18 వరకు టోల్ వసూలు నిలిపివేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. పంతంగి, కోర్లపహాడ్, చిల్లకల్లు టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుందని, ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ నిర్ణయాలు అమలైతే గంటల తరబడి టోల్ గేట్ల వద్ద వేచి చూడాల్సిన అవసరం లేకుండా ప్రయాణికులు క్షేమంగా, వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును 8 గంటల పాటు విచారించిన సిట్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందంఅధికారులు నిన్న రెండోసారి విచారించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు ఆయనను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు.జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. గతంలో 2024 సెప్టెంబర్‌లో మూడు గంటల పాటు విచారించిన సిట్, ఈసారి దాదాపు ఎనిమిది గంటల పాటు నిరంతరంగా ప్రశ్నలు అడిగింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వ్యక్తులతో నవీన్ రావుకు ఉన్న పరిచయాలు, సంబంధాలపైనే ప్రధానంగా విచారణ కొనసాగింది.విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ గత విచారణలో అడిగిన ప్రశ్నలనే మళ్లీ అడిగారని, తాను అన్ని విధాలా విచారణకు సహకరించానని తెలిపారు. మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదని, అయితే అవసరమైతే ఎప్పుడైనా విచారణకు రావడానికి సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. డివైజ్‌ల ద్వారా ఫోన్ ట్యాపింగ్ చేశానన్న ఆరోపణలను ఆయన ఖండించారు.ఈ అంశంపై కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందిస్తూ, ఎలాంటి ఆధారాలు లేకుండా విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ కుట్రలో భాగమని, ఫోన్ ట్యాపింగ్, కార్ రేసు కేసుల పేరుతో బీఆర్ఎస్ పార్టీపై దాడి జరుగుతోందని ఆయన విమర్శించారు.

# 3 వేల గజాల పార్కు స్థలాలను కాపాడిన హైడ్రా

కూకట్‌పల్లి పరిధిలోని 3 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కులను హైడ్రా శనివారం కాపాడింది. ఇలా కాపాడిన భూమి విలువ రూ. 35 కోట్ల వరకూ ఉంటుంది. భాగ్యనగర్ ఫేజ్—3 కాలనీలో రెండు పార్కులు కబ్జాకు గరయ్యాయని హైడ్రా ప్రజావాణికి అక్కడి నివాసితుల సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు వివిధ శాఖలతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నంబరు 197తో పాటు 200లలో 36 ఎకరాలలో భాగ్యనగర్ ఫేజ్- 3 పేరిట హుడా అనుమతి పొందిన లే ఔట్ 1987లో ఏర్పడింది. 357 ప్లాట్లతో ఏర్పడిన ఈ కాలనీలో రెండు పార్కులు ఆక్రమణకు గురయినట్టు గుర్తించారు. 2 వేల గజాల పార్కులో సగం వరకూ కబ్జా అవ్వగా.. ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కులో వెయ్యి గజాల వరకూ ఆక్రమణకు గురైనట్టు పేర్కొంటూ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక మేరకు హైడ్రా కమిషనర్ గారి ఆదేశాలతో శనివారం ఈ ఆక్రమణలను అధికారులు తొలగించారు. రెండు పార్కుల చుట్టూ ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రాణవాయువును అందించే పార్కులను కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.




# రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా జడేజా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రాజస్థాన్ రాయల్స్ తదుపరి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజస్థాన్ రాయల్స్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. తమ సొంత మైదానమైన జైపూర్‌ను కాదని, కొన్ని హోమ్ మ్యాచ్‌లను పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) స్టేడియంలో నిర్వహించేందుకు ఫ్రాంచైజీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఐఏఎన్ఎస్ తన కథనంలో పేర్కొంది. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సీఏ)తో ఫ్రాంచైజీకి ఉన్న విభేదాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతేడాది ఐపీఎల్ 2025 సమయంలో ఓ ఆర్‌సీఏ అధికారి ఫ్రాంచైజీపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది.ఆ ఆరోపణలను రాజస్థాన్ రాయల్స్ తీవ్రంగా ఖండించింది. ప్రస్తుతం ఆర్‌సీఏను తాత్కాలిక కమిటీ నడుపుతుండటం కూడా ఈ మార్పునకు మరో కారణంగా కనిపిస్తోంది.





# నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీని ఒకవైపు ప్రశంసిస్తూనే మరోవైపు నుంచి చురకలు అంటించారు. మోదీ చాలా మంచి వ్యక్తి అని పొగుడ్తూనే.. తనకు నచ్చినట్లుగా చేయకపోతే సుంకాలు పెంచుతానని హెచ్చరించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో చేపట్టబోయే చర్యల గురించి చెబుతున్న వేళ ట్రంప్ భారత్ గురించి కూడా ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించిందని.. తనను సంతోషపెట్టేందుకే భారత ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. " వాళ్లు నన్ను సంతోషపెట్టాలని భావించారు. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. రష్యాతో వారు వ్యాపారం కొనసాగిస్తే.. మనం చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం" అని ట్రంప్ హెచ్చరించారు.